సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం | 31 | డిసెంబర్ | 2023



వాడపల్లి.. భక్తజనవాహిని

కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరుని ఆలయానికి శనివారం వేలాదిగా భక్తులు పోటెత్తారు.


10లో



రత్నగిరిపై ప్రగతి సిరులు

సత్యదేవుని సన్నిధిలో కీలక మార్పులకు 2023 సాక్షీభూతంగా నిలిచింది. ఆధ్యాత్మికంగా, నిర్మాణాల పరంగా చరిత్రలో నిలిచిపోయే మార్పులకు ఈ సంవత్సరమే శ్రీకారం చుట్టారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 12,300 క్యూసెక్కుల గోదావరి నీటిని డెల్టాలకు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,800, మధ్య డెల్టాకు 2,500, పశ్చిమడెల్టాకు 6,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

కౌశల్ క్విజ్ పోటీల్లో దంగేరు విద్యార్థులు ప్రథమం



రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి అందుకుంటున్న దంగేరు విద్యార్థులు

రాయవరం: రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కౌశల్-2023 క్విజ్ పోటీల్లో కోనసీమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కె.గంగవరం మండలం దంగేరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జె.నిఖిల్‌వర్మ, శీలం వినీత, ఎంవీఎస్ శ్రీగణేష్‌లు పాఠశాల, మండల, జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. జిల్లా ద్వితీయ స్థానంతో నిలిచిన ఈ విద్యార్థులు రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులతో పోటీ పడి, ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా సత్తా చాటారు. విజయవాడలో శనివారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా నిఖిల్‌వర్మ, శ్రీ గణేష్, వినీతలు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతి, జ్ఞాపిక అందుకున్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, వారి ప్రగతికి కారకులైన హెచ్‌ఎం నేదునూరి రాజులను సర్పంచ్ వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు కొప్పిశెట్టి లక్ష్మణ్, డీఈఓ ఎం.కమలకుమారి, రామచంద్రపురం డీవైఈఓ శ్రీపాద లక్ష్మీనరసింహ ఫణి, ఎంఈఓలు అలజంగి నాగరాజు, చోడిశెట్టి ఆంజనేయులు అభినందించారు.

ఎగుమతులను ప్రోత్సహించాలి

అమలాపురం రూరల్: జిల్లాలో కొబ్బరి, విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను చైతన్యపరచి, ఆయా ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం జరిగిన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమలకు మంచి అవకాశం ఉందన్నారు. వీటికి అవసరమైన అన్ని అనుమతులను జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యాన సింగిల్ విండో విధానంలో ఇవ్వాలని, వివిధ ప్రభుత్వ పథకాల కింద రాయితీలతో ప్రోత్సహించి, యూనిట్లు గ్రౌండ్ చేయాలని ఆదేశించారు. కమిటీ కన్వీనర్ పీకేపీ ప్రసాద్ మాట్లాడుతూ, జగనన్న బడుగు వికాసం పథకం ద్వారా 23 యూనిట్ల గ్రౌండింగ్ తదితర అంశాలను వివరించారు. ఈ పథకం కింద 17 మంది దరఖాస్తు చేసుకోగా, వీటి పరిశీలనకు వెరిఫికేషన్ కమిటీ అనుమతి తెలిపిందన్నారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద 201 యూనిట్లు లక్ష్యం ఇప్పటి వరకూ 84 గ్రౌండ్ చేశామని వివరించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ ఏడీ శివరాం ప్రసాద్, ఎల్‌డీఎం కె.శ్యాంబాబు, ఏపీఐఐసీ ఎస్టేట్ మేనేజర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్యార్థులు ఓజేటీని సద్వినియోగం చేసుకోవాలి



ఓజేటీ ప్రోగ్రాం సెంటర్‌ను పరిశీలిస్తున్న సత్యనారాయణరెడ్డి

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల కల్పనకు ఏర్పాటు చేసిన 'ఆన్ ది జాబ్స్ ట్రెనింగ్' (ఓజేటీ) ప్రోగ్రామ్‌ను ఒకేషనల్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వృత్తి విద్యాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి కోరారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యాన స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓజేటీ ప్రోగ్రామ్ సెంటర్‌ను ఆయన శనివారం పరిశీలించారు. విద్యార్థినులు, సెంటర్ ఇన్‌చార్జి ఎండీ అల్తాఫ్, లెక్చరర్ పి.వెంకటేశ్వరరావులతో మాట్లాడారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ ట్రైనింగ్ సెంటర్ ద్వారా విద్యార్థినులు ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.



- కొద్ది గంటల్లోనే నూతన ఆంగ్ల సంవత్సరాగమనం
- వేడుకలకు సిద్ధమవుతున్న ప్రజలు
- ఈ ఏడాది మరింత మంచి జరగాలని ఆకాంక్ష

సంతోష గీతికలు.. విషాద విలాపాగ్నులు.. అప్పుడే ఆనందం.. అంతలోనే దుఃఖం.. ఇదే కాలచక్ర పరిభ్రమణం.. ఈ అవిశ్రాంత నిరంతర ప్రవాహంలో అందరం కొట్టుకుపోతూనే ఉంటాం.. సెకన్లు, నిమిషాలు, గంటలు, రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలనే కొలమానాలతో కాలాన్ని కొలుచుకుంటాం. ప్రతి సంవత్సరాన్ని ఒక మైలురాయిగా భావిస్తూ.. కష్టాల్ నష్టాల్ ఎదురైనా భీరువులు కాకుండా.. ధీరత్వం నింపుకొంటూ ముందుకే సాగుతాం. నిన్నటి సంతోషాన్ని పదిలపరచుకుంటాం. తగిలిన గాయాలను మరచిపోతాం. గత కాలపు చేదు మళ్లీ చవి చూడకూడదని కోరుకుంటాం. వచ్చే కాలం సంతోషంగా ఉండాలని.. మంచి జరగాలని ఆశిస్తాం. మరికొద్ది గంటల్లోనే నూతన ఆంగ్ల సంవత్సరం ఆగమించనుంది. గతిస్తున్న 2023కు వీడ్కోలు పలుకుతూ.. కొత్త సంవత్సరం 2024కు స్వాగతం పలుకుతూ వేడుకలు చేసుకునేందుకు మరెంతో సమయం లేదు. ఈ తరుణంలో వివిధ వర్గాల ప్రజలు పాత సంవత్సరం మిగిల్చిన మంచి, చేదు జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ కొత్త లక్ష్యాలను సిద్ధం చేసుకుంటున్నారు. తమ జీవితాల్లో వెలుగుపూలు విరబూయాలని కోరుకుంటున్నారు.

– సాక్షి, అమలాపురం

ప్లేస్‌మెంట్ రావాలి



నేను ఇంజినీరింగ్ పూర్తి చేశాను. ఈ ఏడాది చదువుల పరంగా మంచే జరిగింది. కొత్త ఏడాది మంచి కంపెనీలో ప్లేస్‌మెంట్ వస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం నుంచి గత ఏడాది మా విద్యార్థులం పలు రకాల ప్రయోజనాలు పొందాం. ఏడాదికి రూ.40 వేల చొప్పున నా చదువు పూర్తయ్యే సమయానికి ప్రభుత్వం నుంచి రూ.1.60 లక్షలు ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చింది.

– కల్లేపల్లి మణికంత, ఇంజినీరింగ్ విద్యార్థి, ఆత్రేయపురం

రైతు సంతోషంగా ఉండాలి



2023 సంవత్సరం మా రైతులకు మంచి చేస్తోందని అనుకున్నాం. గత రబీ, ఖరీఫ్ పంటలు బాగా పండాయి. కానీ కోతలకు వచ్చే సమయంలో వర్షాలు దెబ్బ తీశాయి. అయితే తడిసిన ధాన్యాలను ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేయడం సంతోషం. కొత్త ఏడాది రైతులకు ఇటువంటి ఇబ్బందులు లేకుండా పంటలు బాగా పండాలని, రైతు సంతోషంగా ఉండాలన్నదే మా ఆశ.

– యాళ్ల లక్ష్మీనారాయణ, రైతు, భీమనపల్లి, ఉప్పలగుప్తం మండలం

కొత్త సంవత్సరం ఇంకా మేలు జరగాలి



ఈ ఏడాది మహిళలకు చాలా మేలు జరిగింది. మహిళా సంఘాలకు రుణాలు ఇవ్వడం వల్ల వారు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. మా గ్రూపునకు రూ.85 వేల రుణమాఫీ జరిగింది. కొత్తగా రూ.7 లక్షల రుణం మంజూరైంది. ప్రభుత్వం పథకాల లబ్ధిని మహిళల ఖాతాల్లో వేస్తోంది. మహిళా రిజర్వేషన్ బిల్లు వచ్చింది. కొత్త ఏడాది ప్రభుత్వాల నుంచి మాకు మరింత సహకారం రావాలి.

– కుడుపూడి శ్యామల, సాయి చైతన్య ఎస్‌ఎస్‌జీ, కపిలేశ్వరపురం

ఏడాది పొడవునా సంక్షేమం



సీఎం జగన్ వల్ల ఈ ఏడాదంతా మాకు సంక్షేమ పథకాలు అందాయి. నాకు మత్స్యకార భరోసా, నా భార్యకు వైఎస్సార్ ఆసరా, ఇంకా అమ్మ ఒడి పథకాల ద్వారా లబ్ధి చేకూరింది. వచ్చే ఏడాది కూడా జగన్ మరోసారి సీఎం కావాలి. మా వంటి పేదలకు మరింత మేలు జరగాలన్నది మా కోరిక.

– దండుప్రోలు రామచంద్రరాజు, మత్స్యకారుడు, ఓడలరేవు, అల్లవరం మండలం

కొత్త కాంతులు నిండాలి



కొబ్బరి దింపు కార్మికుల జీవనం ఈ ఏడాది సాదాసీదాగా ఉంది. ప్రభుత్వం నుంచి కొన్ని రాయితీలు వస్తున్నా ఇంకా ఆదుకోవాల్సి ఉంది. ప్రమాదవశాత్తూ మృతి చెందిన కుటుంబాలకు అండగా ఉండాలి. కొత్త సంవత్సరంలోనైనా మా దింపు కార్మికుల జీవితాల్లో కొత్త కాంతులు నిండుతాయని ఆశిస్తున్నాం.

– నేదునూరి శ్రీనివాసరావు, కొబ్బరి దింపు కార్మికుడు, గంగలకుర్రు

చాలా వరకూ కోలుకున్నాం



కరోనాతో రెండేళ్ల పాటు వ్యాపారాలు దెబ్బ తిన్నాయి. 2020, 2021లో వ్యాపారాలు మొత్తం దెబ్బ తినగా ఈ ఏడాది చాలా వరకూ కోలుకున్నాం. గత నష్టాల నుంచి అందరూ గట్టెక్కారు. జిల్లా కేంద్రంగా మారడంతో అమలాపురంలో వ్యాపారం బాగా పుంజుకుంది. దేశంలోని ప్రముఖ వస్త్ర, బంగారు దుకాణాలు ఇక్కడ బారులు తీరుతున్నాయి. వచ్చే ఏడాది వ్యాపారం మరింత పుంజుకుంటుందన్నదే మా ఆశ.

– దొమ్మేటి సాయిబాబు, కోశాధికారి, చాంబర్ ఆఫ్ కామర్స్, అమలాపురం

కొంగొత్త ఆశలతో ముందుకెళ్తాం



2023 ఎన్నో అనుభవాలను నేర్పింది. ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండడం వలన వారికి సేవ చేసే అదృష్టం కలిగింది. 2024ను కూడా కొంగొత్త ఆశలతో ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాను. నూతన సంవత్సరంలో కచ్చితంగా మరిన్ని మంచి పనులు ప్రారంభిస్తాను.

– దాట్ల నరేష్‌వర్మ, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్, సచివాలయం-2, రాయవరం



సామంతకుర్రు వాసుల చిరకాల కోరిక తీర్చాం

- మంత్రి పినిపే విశ్వరూప్
- పలు అభివృద్ధి పనులు ప్రారంభం



సామంతకుర్రులో రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: ఒకటిన్నర దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పంచాయతీ భవనాన్ని నిర్మించి, సామంతకుర్రు గ్రామ ప్రజలకు అంకితం చేయడం ఆనందంగా ఉందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. సర్పంచ్ సుందరనీడి సాయికృష్ణ ఆధ్వర్యంలో గ్రామంలో కొత్తగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని, రూ.3.98 కోట్లతో నిర్మించిన గాంధీనగర్ రోడ్డును ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో కలసి మంత్రి శనివారం ప్రారంభించారు. కోడూరుపాడులో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని (ఆర్‌బీకే) కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ, చల్లపల్లి కాలువపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినప్పటికీ కాంట్రాక్టర్ వైఫల్యంతో ఆగిపోయిందన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం చేయించే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. సామంతకుర్రు పంచాయతీ కార్యాలయంలో ఇద్దరు సచివాలయ ఉద్యోగులను అందుబాటులో ఉంచి పౌర సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎంపీ అనురాధ మాట్లాడుతూ, రైతు సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. అధికారుల సలహాలు, సూచనలతో అధిక దిగుబడులు సాధించి, వ్యవసాయాన్ని లాభసాటి మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్ నడింపల్లి సుబ్రహ్మణ్యం రాజు, ఎంపీటీసీ సభ్యులు కర్రి సత్య, గుబ్బల రంగనాథస్వామి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పరమట శ్రీను, జీవీకే చైర్మన్ తిక్కా ప్రసాద్, తహసీల్దార్ సాంబశివప్రసాద్, ఎంపీడీఓ కృష్ణమోహన్, ఏఓ ఎన్‌వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు 'హ్యాపీ న్యూ ఇయర్'

- స్వీట్లు, పూలు, బేకరీ, వస్త్ర, దుకాణాల్లో సందడి
- జిల్లాలో రూ.10 కోట్ల వరకూ వ్యాపారం

అమలాపురం టౌన్: గతిస్తున్న కాలానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఎక్కడ చూసినా కొత్త సంవత్సరం సందడే కనిపిస్తోంది. పట్టణాలు, మండల కేంద్రాలే కాకుండా పల్లెలు సైతం శనివారం నుంచే నూతన సంవత్సర శోభను సంతరించుకున్నాయి. 2023 సంవత్సరానికి చివరి రోజైన డిసెంబర్ 31న.. కొత్త సంవత్సరంలో తొలి రోజైన జనవరి 1న జిల్లావ్యాప్తంగా అన్ని రకాలూ కలిపి దాదాపు రూ.10 కోట్ల మేర వ్యాపారం జరగనుందని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఆదివారం ఒక్క రోజే భారీ ఎత్తున వ్యాపారాలు చేసేందుకు వ్యాపారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

మాంసాహారులకు ఆఫర్లే ఆఫర్లు

సంవత్సరం చివరి రోజు ఆదివారం రావడం మాంసాహార ప్రియులకు మరింత ఆనందంగా ఉంది. దీంతో మాంసం, ఆహార పదార్థాల విక్రయాలు గత ఏడాది కంటే రెట్టింపు స్థాయిలో జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా 31వ తేదీ రాత్రి పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ విందు వినోదాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వనున్నారు. సంగీత విభావరులు (ఆర్కెస్ట్రాలు), ఆటలు, పాటలు,



అమలాపురంలోని ఓ షాపింగ్ మాల్‌లో వినియోగదారుల సందడి

వివిధ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కొత్త సంవత్సర వేడుకల నేపథ్యంలో ఇప్పటికే ఉన్న నాన్ వెజిటేరియన్ (ఎన్‌వీ) హోటళ్లలో రోజూ కంటే రెండు మూడు రెట్లు అధికంగా అమ్మకాలు చేసేందుకు ఫుడ్ మెటీరియల్ సిద్ధం చేసుకున్నారు. దీనికితోడు కేవలం 31వ తేదీ ఒక్క రోజే మాంసాహార ప్రియుల కోసం రోడ్ల చెంతన కూడా తాత్కాలిక హోటళ్లు అనేకం ఏర్పాటు చేశారు. స్పెషల్ బిర్యానీ, చికెన్ లేయర్ బిర్యానీ, బాయిలర్ బిర్యానీ, చికెన్ ఫ్రై ధరలు తగ్గిస్తూ అధికంగా ఆఫర్లు ప్రకటిస్తున్నారు. ఈ మేరకు జిల్లాలోని తాత్కాలిక హోటళ్ల వద్ద బోర్డులు ఏర్పాటు చేసి మరీ మాంసాహార ప్రియులను ఆకర్షిస్తున్నారు. సాధారణ రోజుల్లో హోటళ్లలో రూ.250 నుంచి రూ.300 వరకూ ఉండే బాయిలర్ బిర్యానీని డిసెంబర్ 31న కేవలం రూ.150కే విక్రయిస్తున్నట్లు ప్రకటిస్తున్నారు. ఇలా ప్రతి నాన్ వెజిటేరియన్ ఫుడ్ ఐటమ్‌ల తగ్గింపు ధరలపై విస్తృత ప్రచారం చేస్తున్నారు.

ఈ షాపుల్లో వ్యాపారం ఫుల్

డిసెంబర్ 31, జనవరి ఒకటో తేదీల్లో భారీ అమ్మకాల కోసం జిల్లావ్యాప్తంగా వస్త్ర, బేకరీ, పూలు, స్వీట్లు, చికెన్ షాపుల్లో సరకును సిద్ధం చేశారు. అమలాపురం, రామచంద్రపురం, మండపేట కేంద్రాల్లో అయితే ఈ ఐదు రకాల షాపులనూ వినియోగదార్లను ఆకర్షించేలా ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. ఈ మూడు పట్టణాల్లోని షాపింగ్ మాల్స్ వినియోగదారులతో రద్దీగా కనిపిస్తున్నాయి. నాన్ వెజిటేరియన్ హోటళ్లు, తాత్కాలిక బిర్యానీ పాయింట్ల వద్ద డిసెంబర్ 31న బేరాలు అధికంగా ఉండనున్నాయి. పూలు, బేకరీ, వస్త్ర, చికెన్ దుకాణాల ద్వారా ఆది, సోమవారాల్లో భారీగా వ్యాపార లావాదేవీలు జరగనున్నాయి. బేకరీల్లో కేకులకు, పూల దుకాణాల్లో పూలదండలు, బొకేలకు, స్వీటు దుకాణాల్లో స్వీటు ప్యాకెట్లకు ఇప్పటికే అధికంగా ఆర్డర్లు వచ్చేశాయి. ఈ వ్యాపారాలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా దాదాపు 450 దుకాణాలు ఉండగా, మరో 800 పైగా తాత్కాలిక దుకాణాలు వెలిశాయి. మరోవైపు న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో ఇళ్ల ముంగిట రంగవల్లులు తీర్చిదిద్దేందుకు అతివలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆ ముగ్గులకు అవసరమైన వివిధ రంగు పొడర్ల దుకాణాలు వెయ్యికి పైగా తాత్కాలికంగా రోడ్ల చెంతన నెలకొల్పారు.

రోడ్లపై వేడుకలకు 'నో'

అమలాపురం టౌన్: పోలీసుల సూచనలకు అనుగుణంగా నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ వేడుకలను ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంటకే పూర్తి చేయాలన్న జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆదేశాల మేరకు జిల్లా అంతటా పోలీసు నిఘా ఏర్పాటు చేశామన్నారు. పోలీసు సబ్ డివిజన్‌లో సెక్షన్ 30 యాక్ట్ అమలులో ఉందని, ఈ దృష్ట్యా ప్రజలు వేడుకల నిర్వహణకు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ వివరించారు.

- సభలు, సమావేశాలు, ఊరేగింపులకు డీఎస్పీ నుంచి ముందస్తు అనుమతి ఉండాలి.
- రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో వేడుకలకు అనుమతులు లేవు.
- బాణసంచాకు అనుమతి లేదు.
- మద్యం తాగి, తాగుతూ వాహనాలు నడిపితే కఠిన చర్యలు. అతి వేగం అసలే వద్దు.
- మోటారు సైకిళ్ల సైలెన్సర్లు తీసేసి, రణగొణ ధ్వనులు సృష్టించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవు.
- ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో పోలీసు పెట్రోలింగ్ ఏర్పాటు.
- రోడ్లపై గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే చర్యలు.
- వినోదాల పేరుతో పెద్దపెద్ద శబ్దాలతో డీజేలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవు.
- ప్రజలకు అసౌకర్యం కలిగించేలా ఎవరైనా ప్రవర్తిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలి.

ఎస్సీ, ఎస్టీ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

- ప్రజలు సామరస్యంగా జీవించేలా అవగాహన కల్పించాలి
- కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల సత్వర పరిష్కారంపై న్యాయ, పోలీస్, రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం జరిగిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. పౌర హక్కుల రక్షణ, ఎస్సీ, ఎస్టీలపై దురాగతాల నివారణ చట్టం అమలుపై జిల్లా అప్రమత్తత, పర్యవేక్షణ అధికారుల సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ వర్గాలపై ఎటువంటి దాడులూ జరగకుండా ప్రజలందరూ సామరస్య పూర్వకంగా జీవించేలా అవగాహన పెంపొందించాలని ఆదేశించారు. విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశాలకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. కోర్టుల వద్ద అట్రాసిటీ కేసులు పెండింగ్ లేకుండా చూడాలని సూచించారు. అట్రాసిటీ కేసుల పరిష్కారానికి స్థానికంగా కోర్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అత్యాచార నేరాలకు పాల్పడిన వారిపై పూర్తి స్థాయిలో కేసులు నమోదు చేసి, విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేకూర్చాలని చెప్పారు. చట్ట ప్రకారం బాధితులకు ఉపశమనం, సామాజిక, ఆర్థిక పునరావాసం కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరిగినప్పుడు వెంటనే స్పందించి, ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి, త్వరగా చార్జిషీట్ వేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రతి నెల 30న మండల స్థాయిలో తప్పనిసరిగా పౌర హక్కుల దినోత్సవాలు నిర్వహించాలన్నారు. గత ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ జిల్లావ్యాప్తంగా 308 కేసులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వీటికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఎఫ్ఐఆర్ దశలో 64 కేసులకు రూ.28,25,000, చార్జిషీటు దశలో 62 కేసులకు రూ.65,12,500, పోస్టుమార్టం, మెడికల్ ఎగ్జామినేషన్ దశలో 4 కేసులకు రూ.14,37,500 కలిపి మొత్తం 130 కేసులకు రూ.1,07,75,000 పరిహారం మంజూరు చేశామని వివరించారు. అమలాపురం డివిజన్‌లో 24 కేసులు రాగా 12, రామచంద్రపురం డివిజన్‌లో 20 కేసులు నమోదు కాగా 10, కొత్తపేట డివిజన్‌లో 17 కేసులు నమోదు కాగా, 5 కేసులు ప్రాసెస్‌లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ ఖాదర్ బాషా, డీఆర్ఓ సీహెచ్ సత్తిబాబు, ఆర్‌డీఓలు ఎం.ముక్కంటి, ఎస్.సుధాకర్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి, డీఎస్పీలు అంబికా ప్రసాద్, రామకృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వాడపల్లిలో భక్తజన సందోహం

వాడపల్లి.. భక్తజనవాహిని

ఆత్రేయపురం: ధనుర్మాసం, అందునా స్వామివారికి ప్రీతికరమైన శనివారం కావడంతో కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరుని ఆలయానికి వేలాదిగా భక్తులు పోటెత్తారు. ముఖ్యంగా ఏడు శనివారాల నోము ఆచరించిన వారు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. స్వామివారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారు పూర్ణాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాన్ని ప్రత్యేకంగా వివిధ రకాల పండ్లు, పువ్వులతో అలంకరించారు. ఆలయ ఆవరణలో సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యాన పర్యవేక్షించారు. భక్తుల విరాళాలు, కానుకల రూపంలో స్వామి వారికి రూ.30,07,239 ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు.



పూర్ణాలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి →

తమ్ముడి చేతిలో అన్న హతం



శ్రీనివాస్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ కుమార్, ఎస్సై సాగర్

కొత్తపేట: తమ్ముడి చేతిలో అన్న హతమైన సంఘటన కొత్తపేటలో చోటు చేసుకుంది. కొత్తపేటకు చెందిన బూరగాయల విజయభాస్కర వెంకట శ్రీనివాస్(56)కు తల్లి, ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. శ్రీనివాస్‌కు 18 ఏళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు కుమార్తెలు పుట్టిన తర్వాత భార్య అతడిని విడిచిపెట్టి, పిల్లలతో కలసి గుంటూరులోని పుట్టింట్లో ఉంటోంది. శ్రీనివాస్ తమ్ముళ్లకు వివాహాలు కాలేదు.

శ్రీనివాస్, అతడి రెండో తమ్ముడు సోమశేఖర్ తరచూ గొడవ పడుతూంటారు. సోమశేఖర్ ఇంట్లోకి రావడానికి వీలులేదని ఇటీవల శ్రీనివాస్ హెచ్చరించాడు. ఈ నేపథ్యంలో సోమశేఖర్ శనివారం ఇంట్లోకి రావడంతో అన్నదమ్ముల మధ్య మరోసారి తీవ్ర వాగ్వాదం జరిగింది. అనంతరం తమ్ముడిని బయటకు పంపేసి వచ్చి శ్రీనివాస్ పడుకున్నాడు. కొంతసేపటికి తమ్ముడు సోమశేఖర్ ఇనుప రాడ్డు తీసుకుని వచ్చి నిద్రిస్తున్న అన్న తలపై బలంగా మోదాడు. దీంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్‌తో పాటు సోమశేఖర్‌కు కూడా మతిస్థిమితం సరిగా ఉండదని స్థానికులు చెబుతున్నారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ కేవీ రమణ, ఇన్‌చార్జి సీఐ ప్రశాంత్‌కుమార్ సందర్శించి, శ్రీనివాస్ మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై జ్వాలాసాగర్ తెలిపారు.

గేదెకు కవల దూడలు

అమలాపురం రూరల్: కామనగరువు గ్రామానికి చెందిన రైతు అత్తిలి సత్తిరాజు కమతంలో ఓ గేదె రెండు దున్న దూడలకు శనివారం ఉదయం జన్మనిచ్చింది. సాధారణంగా ఆవులు, గేదెలకు కవల దూడలు పుట్టడం అరుదు. ఈ నేపథ్యంలో తమ గేదెకు కవలు దూడలు పుట్టడంపై ఆ రైతు కుటుంబం ఆనందం వ్యక్తం చేస్తోంది. గ్రామంలోని రైతులు ఆ దూడలను ఆసక్తిగా తిలకించారు.



ప్రైవేటు బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం

ఆలమూరు: జొన్నాడ – మండపేట రోడ్డులో కొత్తూరు సెంటర్ వద్ద జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై ఎల్.శ్రీను నాయక్ కథనం ప్రకారం.. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట గ్రామానికి చెందిన డ్రైవర్ నక్కా వీరన్న (29) వృత్తి పని మీద శనివారం ఉదయం తన బైక్‌పై కాకినాడ వెళుతున్నాడు. స్థానిక బ్లూ బెల్స్ కాన్వెంట్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి అతి వేగంతో వస్తున్న కావేరీ ట్రావెల్స్ ప్రైవేటు బస్సు అతడిని బలంగా ఢీకొంది.

ఈ ప్రమాదంలో తల నుజ్జునుజ్జవడంతో వీరన్న అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మండపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రత్నగిరిపై ప్రగతి సిరులు

- సత్యదేవుని సన్నిధిలో కీలక మార్పులకు సాక్షిగా 2023
- పదేళ్ల తరువాత అనేక అభివృద్ధి పథకాలకు శ్రీకారం

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో కీలక మార్పులకు 2023 సాక్షీభూతంగా నిలిచింది. అటు ఆధ్యాత్మికంగా, ఇటు నిర్మాణాల పరంగా చరిత్రలో నిలిచిపోయే మార్పులకు ఈ సంవత్సరమే శ్రీకారం చుట్టారు. గత పదేళ్లలో దేవస్థానంలో పెద్దగా చెప్పుకోదగిన నిర్మాణాలు లేవు. ఈ పరిస్థితుల్లో గత ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ చొరవతో 2023లో అనేక నిర్మాణాలు రూపుదిద్దుకున్నాయి. వీటిలో కొన్ని పూర్తి కాగా, మరికొన్ని పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుత ఈఓ కె.రామచంద్రమోహన్ కూడా దేవస్థానం అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటున్నారు. మధ్యలో నిలిచిపోయిన అనేక నిర్మాణ పనులు చురుకుగా జరిగేలా చూస్తున్నారు. ఫలితంగా ఈ కార్తిక మాసంలో సత్యదేవునికి రికార్డు స్థాయిలో రూ.20.60 కోట్ల ఆదాయం సమకూరింది. సుమారు రూ.30 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న శివసదన్, డార్మెట్రీ, ఆదిశంకర మార్గ్, ఇతర నిర్మాణ పథకాలను డిప్యూటీ సీఎం, దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఈ నెల 19న ప్రారంభించారు. దేవస్థానంలో ఇంత భారీ స్థాయిలో ప్రారంభోత్సవాలు జరగడం ఇదే ప్రథమం. అన్నవరం దేవస్థానంలో ఈ ఏడాది జరిగిన అభివృద్ధిపై అవలోకనం..

అందుబాటులోకి శివసదన్ సత్రం

సత్యగిరిపై సుమారు రూ.20 కోట్లతో నిర్మించిన 135 గదుల శివసదన్ సత్రం ఈ ఏడాది నవంబర్ నుంచి భక్తులకు అందుబాటులోకి వచ్చింది. ఈ సత్రం నిర్మాణం 2018లో మొదలైంది. కరోనా ప్రభావంతో రెండేళ్లు, అది సృష్టించిన ఆర్థిక ఇబ్బందులతో మరో ఏడాది పనులు నెమ్మదించాయి. 2023 మార్చిలో దేవస్థానం ఈఓగా బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్ ఆజాద్ చొరవతో దీని నిర్మాణం పూర్తవడంతో భక్తుల వసతి సమస్య చాలా వరకూ పరిష్కారమైంది. ఈ సత్రం ద్వారా రోజుకు సుమారు రూ.2 లక్షల ఆదాయం వస్తోంది.

డార్మెట్రీ రెడీ

దాత పెన్నాడ రాజామణి రూ.2 కోట్ల వ్యయంతో శ్రీ వనదుర్గ ఆలయం వద్ద నిర్మించిన మూడంతస్తుల యాత్రికుల విశ్రాంతి భవనం (డార్మెట్రీ) కూడా కార్తిక మాసంలోనే భక్తులకు అందుబాటులోకి వచ్చింది. దీనిని మెట్ల దారిన వచ్చే భక్తుల కోసం నిర్మించినప్పటికీ, వసతి గదులు లభ్యం కాని వారికి ఇది ఎంతో ఉపయోగపడుతోంది. ఇక్కడ సుమారు 1,500 మంది భక్తులు విశ్రాంతి తీసుకునే వీలుంది.

రూ.4 కోట్లతో నమూనా ఆలయం

రూ.4 కోట్లతో నిర్మిస్తున్న సత్యదేవుని నమూనా ఆలయం పనులు ఈ ఏడాది ప్రారంభమై, చురుకుగా జరుగుతున్నాయి. విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం జాతీయ రహదారిపై డిగ్రీ కళాశాల సమీపాన ఈ ఆలయం నిర్మిస్తున్నారు. ఇక్కడ సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుల ఉత్సవమూర్తుల దర్శనంతో పాటు సత్యదేవుని ప్రసాదం విక్రయాల కౌంటర్ కూడా ఏర్పాటు చేయనున్నారు. దీంతోపాటు విశ్రాంతి భవనాలు, టాయిలెట్ బ్లాక్‌లు, క్యాంటీన్ సదుపాయాలు కల్పిస్తున్నారు.

ఆదిశంకర మార్గ్, ప్రకాష్ సదన్ ర్యాంపు

పాత సీఆర్ఓ కార్యాలయం వెనుక నుంచి రెండో ఘాట్ రోడ్డుకు కలుపుతూ నిర్మించిన ఆదిశంకర మార్గ్ భక్తులకు ఎంతో ఉపయోగపడింది. గత కార్తిక మాసంలో ఈ రోడ్డు మీదుగా వందలాది వాహనాలు కొండ దిగువకు వెళ్లడంతో రత్నగిరిపై ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలగలేదు. అదేవిధంగా ప్రకాష్ సదన్ పక్క నుంచి నిర్మించిన ర్యాంపు రోడ్డు ద్వారా వాహనాలు నేరుగా పశ్చిమ రాజగోపురం వైపు వెళ్లే అవకాశం కలిగింది. సత్యగిరి రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన మల్టీ లెవెల్ పార్కింగ్ కూడా వందలాది వాహనాలను నిలిపేందుకు ఉపయోగపడింది. ఇవే కాకుండా కొండ దిగువన కళాశాల మైదానంలో భక్తుల విశ్రాంతి షెడ్లు, స్వామివారి ఆలయం వద్ద విశాలమైన క్యూ లైన్లు భక్తులకు ఎంతో సౌకర్యవంతంగా ఉన్నాయి.

ముత్తంగి సేవ.. నిజరూప దర్శనం

సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరులకు ముత్యాలతో చేసిన వస్త్రాలతో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ముత్తంగి సేవను ఈ ఏడాదే ప్రారంభించారు. ఇది భక్తులకు మధురానుభూతిని కలిగిస్తోంది. అలాగే, ప్రతి గురువారం స్వామివారి నిజరూప దర్శనం కూడా భక్తులకు కన్నుల పండగే అవుతోంది.

నాలుగు దేవతా ప్రతిరూపాలు

క్షీరసాగర మథనంలో ఉద్భవించిన నాలుగు దేవతా ప్రతిరూపాలు గంధపు చెట్టు, (గంధపు గిన్నె), లక్ష్మీదేవి (లక్ష్మీ హుండీ), కల్పవృక్షం, కామధేనువు రూపాలను సత్యదేవుని ఆలయం నలుదిక్కులా ఏర్పాటు చేశారు. వాటిని దర్శిస్తూ ప్రదక్షిణ చేసే వీలు కల్పించారు. ఈ ప్రదక్షిణ దర్శనం భక్తులకు చాలా సంతృప్తినివ్వడంతో పాటు ఆధ్యాత్మిక పరిమళాలను మరింతగా వెదజల్లుతోంది.

మాడ వీధుల ప్రణాళిక

తిరుమల తరహాలో సత్యదేవుని ఆలయానికి కూడా నాలుగు వైపులా మాడ వీధుల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధమైంది. సుమారు రూ.12 కోట్ల వ్యయం కానుండటంతో దేవస్థానం అధికారులు దీనిపై తర్జనభర్జన పడుతున్నారు. ఇది ఎప్పటికైనా పూర్తవుతుందనే విశ్వాసం అందరిలో వ్యక్తమవుతోంది.



సత్యదేవుని ఆలయం

రత్నగిరి 2023 రివైండ్



ముత్తంగి వస్త్రాలంకరణలో సత్యదేవుడు, అమ్మవారు, శంకరులు

అమ్మవారికీ వజ్రకిరీటం

ప్రముఖ పారిశ్రామికవేత్త, దాత మట్టే సత్యప్రసాద్ దంపతులు సత్యదేవునికి ఏడాది క్రితం రూ.2 కోట్లతో వజ్రకిరీటం చేయించిన విషయం విదితమే. వారు ఈ ఏడాది అనంత లక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి కూడా మరో రూ.2 కోట్లతో వజ్రకిరీటం చేయిస్తున్నారు. దీనిని మరో నెల రోజుల్లో అమ్మవారికి అలంకరించనున్నారు.

- కార్తిక పౌర్ణమి నాడు జరిగిన సత్యదేవుని గిరి ప్రదక్షిణలో 2 లక్షల మంది భక్తులు, సత్యదేవుని దర్శనానికి 1.5 లక్షల మంది భక్తులు తరలి వచ్చారు. ఆ రోజు అన్నవరాన్ని భక్తజన సునామీ ముంచెత్తింది.
- 30 వీఐపీ సత్రం స్థానంలో విశాలమైన విశ్రాంతి షెడ్డు భక్తులకు వరంగా నిలిచింది. ఇక్కడ శాశ్వత షెడ్డు నిర్మాణానికి ప్రణాళిక రూపుదిద్దుకుంది.
- కొత్త సంవత్సరంలో కూడా సత్యదేవుని సన్నిధిలో అనేక నిర్మాణాలు, సేవా కార్యక్రమాలు రూపుదిద్దుకోవాలని అందరూ ఆశిస్తున్నారు.


రాష్ట్ర స్థాయి తైక్వాండోలో పతకాలు



రాష్ట్ర స్థాయి తైక్వాండోలో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన ఉమ్మడి జిల్లా జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): విజయవాడలోని ఏపీఎస్ ఆర్ఎంసీ హైస్కూల్‌లో శుక్ర, శనివారాల్లో జరిగిన 39వ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. జూనియర్స్ విభాగంలో 18 బంగారు, 8 రజత, 8 కాంస్య పతకాలు అందుకున్నారు. తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్, ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కార్యదర్శి ఎలీషాబాబు, మాజీ ఒలింపిక్ సంఘ కార్యదర్శి పద్మనాభం అభినందించారు.

మంచు పరదాల్లో మాయమైనది



శరత్కాలం వెళ్లి.. హేమంతం ప్రవేశించి అప్పుడే పక్షం రోజులు దాటిపోయింది. హేమంతం అంటేనే 'హిమ'వంతం.. పట్టపగలు కూడా ఒక్కోసారి సూర్యుడి జాడే సరిగ్గా కానరాదు.. వచ్చినా ఆ ఎండ కూడా కాసేపే.. రాత్రవుతున్నకొద్దీ చలి పులి పంజా విసురుతూంటుంది. వేకువన మంచు తెరలుతెరలుగా నేలతల్లిని చుట్టేస్తూ ఉంటుంది. అందునా పచ్చని కోనసీమలో 'హిమ' మహిమలు చెప్పనలవి కాదు. పి.గన్నవరం వద్ద కొత్త అక్విడెక్ట్ ఆ కొన భాగం, పావన వైనతేయ గోదావరి నది శనివారం ఉదయం దట్టమైన మంచు పరదాల్లో మాయమైన అందాల చిత్రమిది.

– పి.గన్నవరం